నిషిద్ధదీవి

శ్రీమతి డి. కమలావతికన్యగారు

ప్రతాపసింగ్ యను నొకసంస్థానాధీశ్వరుని సైనికదళములో వీరాగ్రేసరులని పేరెన్నికగాంచిన వారలు విజయసింహ విక్రమసింహులు. తోబుట్టువులు గాకున్నను, విధాత వారల రూపరేఖాదులందు వ్యత్యస్తముల నంతగా పాటించనందున చూపఱుల కేకగర్భజనితులట్లే గాన్పించుచుండిరి. వారిరువుర మధ్య రహస్యగోపనమనునది లేశమేని గాన్పించకుండెడిది. బాల్యమాదిగా దృఢస్నేహపాశబద్ధములా హృదయములు. ఆహారవిహార శయ్యాసనాదులందు నొండొరుల వీడక ఛాయవోలె నొకరినొకరు యనువర్తించుచుండిరి.

యౌవనాంకురమగుటతోడనే విక్రమసింహుని హృదయావరణమున ప్రణయాంకురములును బొడసూపసాగెను. ప్రతాపుని యేకపుత్రియగు ప్రసన్నకుమారిదెస కాతని డెంద మాకర్షింపబడదొడంగెను. నాటికాలపు వీరులలో నగ్రగణ్యుడెవ్వడో నాతనికి తన తనుమానసముల నర్పింప నిశ్చయించుకొనిన యాసుందరిని బడయునిమిత్తము యనేక వీరులు సాధించనేరని యొకానొక దుష్కరకార్యనిర్వాహణమున కాతడు బూనుకొనెను.

ప్రతాపసింగ్ యొక్క సంస్థానసరిహద్దుల కనతిదూరమున అజయసింహుడను సార్థకనామధేయు డొకడు నిషిద్ధదీవికి నాయకుడుగానుండి మానవమాత్రులనెల్లరిని తన యమానుషబలముచే పరాజితులనుగా జేసి వారల నిహతుల గావించుచుండెను. అసంఖ్యాకులగు శూరు లాతనిచే యోడింపబడి ప్రాణములతో స్వస్థానములకు జేరుకొనగలిగినను తమ పరాభవస్మృతి చిహ్నముగా తమ దక్షిణహస్తపు చిటికెనవ్రేలి నాతనికడ నుంచి పోవలసివచ్చుచుండుట యాచారముగా నుండెను. ఈ ఘోరసమాచారము నెల్ల నామూలాగ్రముగా నెఱిగియుండియు విక్రమసింహుడు తన ప్రణయదేవతకు ఈ యపూర్వవిజయమును అరణముగా నీయ దలచి రహస్యముగా యాదీవిమార్గముబట్టి చనెను.

ఒక భీకరారణ్యమున కావలనున్న నిషిద్ధదీవి నాయకునకు యీ నూతన ప్రతిపక్షియాగమనవార్త యథాకాలమున నివేదింపబడెను. ఘోరాతిఘోర సంగ్రామములను క్రీడా సమానముగా భావించు ఆనాయకుడు శౌర్యరసముట్టిపడ ఎఱ్ఱని కవచము, డాలు, శిరస్త్రాణము మున్నగు పరికరములతో ద్వంద్వయుద్ధమునకు సన్నద్ధుడయ్యెను. అవలీలగా విక్రమసింహుని గుఱ్ఱముపై నుండి పతితుని గావించెను. క్రుద్ధుడై విక్రమసింహుడొక్క యుదుటున కరవాలమును దూసి యాతనిపై లంఘించి సంతతధారగా ఖడ్గాఘాత వృష్టి గురిపించెను గాని యేమి లాభము! ఆ కత్తిపోటు లాదృఢ కవచమును భేదింపజాలవయ్యె. అజయుని ప్రతిదెబ్బకును తనకవచము లొంగిపోవుచుండ, యాక్షతబహిర్గత రక్తస్రవణముచే శక్తి సొమ్మగిల్ల,

ముఖముమీదుగా స్రవించుచున్న రక్తము దృష్టి నాటంకపఱుప శత్రుపాదములచెంత యా నిర్భాగ్య యువకుడు మూర్ఛితుడయ్యెను.

పునః స్మృతివచ్చి చూచుకొను సరికి యానిబిడారణ్య మధ్యమున తన మృతాశ్వము చెంత తా నొంటరియై బడియుండెను. సమీపపు నీటిపట్టుకడకు ప్రాకికొనుచుబోయి కాలుసేతుల శుభ్రపఱచుకొని తనగాయముల పరిశీలించుకొనుచుండ తనకుడిచేతి చిటికెనవ్రేలు గాన్పింపదయ్యె. "ఇస్సీ"! యని యొక్క నిట్టూర్పుబుచ్చి అజయుడు నిర్దయుడు గనుకనే తన్ను సంహారించక యిట్టి పరాభవ క్లేశాగ్ని కీలలచే దహింపదలచెననియాతని నిందించుచుండ తనప్రక్కనే యిట్టి యదృష్టమును బడసి దీర్ఘనిద్ర బోవుచున్న యొక వీరుని, ఆప్రక్కనే మేయుచు నిలుచున్న యాతని బక్కగుఱ్ఱమును జూడగలిగెను. అతిప్రయాసతో దానినధిరోహించి యావిక్రమసింహుడు స్వగృహాభిముఖుడాయెను.

నిరాశాచిత్తుడై తన దురదృష్టమునకు పలవించుచు యాదినమెల్ల ప్రయాణమొనర్చి సూర్యాస్తమయ వేళకు సరిగా యొకనందనోద్యాన మధ్యమున నొక గొప్ప భవనమును గని యట విశ్రమింప నుద్యుక్తుడగుచుండ మనోహరాలంకారిణి యగు నొక విశ్వమోహిని సాక్షాత్కరించి మంజులస్వనంబున నిట్లనియె.

"ఆర్యా! నా పితృగృహద్వారము వీరులకు స్వాగతమిచ్చుటకై సదా తెరువబడియే యుండును. పరిచర్య లందుకొను దుస్థితిలో నున్న నీవు కటికనేలపై శయనింపజాలవు."

"దయామతీ! నేనును కడుబడలిన నా గుఱ్ఱమును విశ్రాంతి నభిలషించవలసిన సమయమిది. అయినను, నావంటి దౌర్భాగ్యశాలి నీపితృగృహమున యతిథిగా నాదరింపబడ దగడేమో యని యనుమానించుచున్నాను.

ఆమె నిరుత్తరయాయెను, ఒక్కక్షణమూరకుండి తనదాసీల బిలచి అనుజ్ఞల నొసగెను. ఒకతె గుఱ్ఱమును గొనిపోయెను. వేరిర్వురు విక్రముని లోనికి గొంపోయి, కడు నిపుణతతో గాయముల శుభ్రముజేసి, కట్లుగట్టి, భోజనాదుల నిడి, మెత్తని పాన్పుపై శయనింపజేసిరి. వీరమతి—యాగృహాధికారి కోమరిత—యే తెంచి యాతని కుడిహస్తవీక్షణ మాత్రమున సర్వము గ్రహించి, యొక్క దీర్ఘనిశ్వాసము విడిచి, అతడు నిదురించు వరకును వీణానాదముతో తన కోమలకంఠస్వరము నైక్యముజేసి పాడ దొడంగెను. నిషిద్ధదీవినుండి మగిడి వచ్చు అనేకవీరులామె సపర్యలనంది యాయనుపమగానమాధుర్య రసాస్వాదనముచే ధన్యులమైతిమని తలచి హాయిగా ఆరేయి సుఖనిద్దురజెందినవారలే.

మఱునాటి యుదయమున ఆ మృదుమనస్క తిరిగి యాతని గాయములకు చికిత్స గావించి త్వరలో బైలుదేర నాతురపడుచున్న యాతని దక్షిణహస్తమునకు తనపట్టు

చేతిగుడ్డనుజుట్టి నూతన శక్తిని ప్రసాదించు సంజీవినివంటి యౌషధమును ద్రావనిచ్చి సాగనంపెను. అహంకారయుక్తయగు ప్రసన్నకుమారిసుందరమూర్తినే హృదయమున ప్రతిష్ఠించుకొనిన యా యువకుడు తనకిట్టి మహోపకారమొనర్చిన సుగుణరాశి నామమేయక్షరములచే నలంకరింపబడుచుండెనో తెలిసికొన నపేక్షింపక కృతఘ్నుని భంగి వెడలిపోయెను.

ప్రతాపసింగ్ కోటద్వారమును సమీపించునరికి గాయములనుండి తిరిగి రక్తము ప్రవహింప నారంభించెను. మనోవేదనచే శరీర మింకను అవశమగుచుండ అతడు గుఱ్ఱమునుండి భూమిపై గూలెను. గుఱ్ఱమాతని విడిచి చనెను. కొంతతడవునకు నేత్రములువిచ్చి చూచి తన నిస్సహాయస్థితికి వగచుచు ఆ సంధ్యా చీకటిలో ఒరులు తన్ను గుర్తింపకనే కాళ్లీడ్చుకొనుచు తనగది జేరుకొనగలిగెను. అకస్మికముగా లోచన గోచరమైన తన ప్రాణస్నేహితుని అట్టి విషమస్థితియందు జూచి విజయసింహు డాశ్చర్యవిషాద సంభ్రమములు ముప్పిరిగొన వేవేగ మాతని పరుండజేసి విశ్రమించిన పిదప ఖండఖండములుగా ఆతని కథనెల్ల తెలిసికొన గలిగెను.

"గౌరవ సంపాదనార్థము బయల్వెడలిన నేను శాశ్వత అపయశస్సును కొనిరాగలిగితిని" యని యాతడు వాపోవు చుండెను.

"నీ వింతగా విలపింపవలసిన యావశ్యకత లేదు. అజయునిచే విజితులైనవారలు శౌర్యహీను లనబడరు, యాతని పరాక్రమము సాటిలేనిది. అయితే ముఖ్యసంగతి యొకటి గలదు. నీవాతనిచే నోడింపబడినటుల ప్రసన్నకుమారి చెవిని బడరాదు" అని విజయసింహుడనుచుండ ద్వారమున కవతల ఎవ్వరిదో పదధ్వని వినవచ్చె. వెళ్లి చూచునరికి గర్వితయు అభిమానవతియు నగు ప్రసన్నకుమారి వీరి సంభాషణము నాలకించి తిరిగి పోవుచున్నటుల గ్రహింపగలిగెను. మిత్రుని మనస్సంకట మధికమగునను తలంపుచే, ఇవ్విషయమును దాచియుంచి కుక్కవలన గలిగిన నవ్వడిగాని మరేమి లేదని యాతని యనుమాన పిశాచమును పాఱద్రోలెను.

విక్రమసింహుని గాయముల పరీక్షించిన రాచవైద్యులు తలలూపిరి. తొమ్మిది దినము లాతడు మృత్యుసన్నిధానమున బడియుండ ప్రసన్నకుమారి దక్క తదితరు లెల్లరు నాతనినిమిత్తము కంటనీరు బెట్టుచుండిరి. తన యాత్మప్రీత్యర్థ మిట్టి ఘోరాపాయమున బడవలసి వచ్చిన యా ప్రేమమూర్తిని గాంచుటకు కఠిన హృదయయగు నా ప్రసన్నకుమారి యిచ్చగింపలేదు సరిగదా పైగా శూలములవంటి పరుషవాక్కుల నాతనిపైన ప్రయోగించుచుండ వానినెల్ల తన మిత్రుని చెవిని బడకుండ మిగుల జాగ్రత్తతో విజయుడు దివారాత్రము లాతని పర్యంకము దగ్గఱనే కనిపెట్టుకొనియుండెను. ఒకనాడాతడు ప్రసన్నకుమారిని సమీపించి యామెతో నిట్లనెను. "నీకొఱకై తిరిగి అజయునితో యుద్ధమొనర్చుటకు నామిత్రు డిష్ట

పడుచున్నాడు; గనుక ఆతనియెడల కనికరము బూని, యీ సాహసికోద్దేశము నుండి యాతని మరల్పుము."

"ఆతని ఇష్టమునకు నావ్యతిరేకమేమియు నుండదు. ఆతని విజయములగాంచి ముగ్ధనై ఆతనికన్న శ్రేష్ఠు లెందరినో నేను నిరసించితిని, ఇప్పుడైతేనో ఆతని నాజ్ఞాపించుటకుగా చిత్త మంగీకరించుటలేదు."

ఇట్టి ప్రత్యుత్తరమును విని విజయుడు కోపోద్రేకముతో తన మిత్రున కామె యవిశ్వాసమును వెల్లడించెను; ఆమె తిరస్కరణమునకు హేతువును గ్రహింపగలిగిన విక్రమసింహుడు ఆ కళంకమును దుడిచి వేసికొనవలెనని తలచి యాభావోద్రేకజనిత బలమువలన క్రమముగా నారోగ్యదశకు రాదొడంగెను.

స్నేహితుని యుత్తేజమునకు మనస్సు గరగ విజయు డాతనితో "మిత్రుడా! నా సలహా నంగీకరింతువేని యాగర్విత నొక్క మాసములోగా పరిణయ మాడగలవు" యనెను.

"అదెట్లు?"

"కొన్ని దినముల పర్యంతము ఇతరుల కగుపడక నేనే అస్వస్థుడనై యున్నటుల వర్తింపనిమ్ము. నా సోదరుడు జగత్సింహుడు నీకడనుండును. నీనామమునుదాల్చి, నీవేషమును ధరించి అజయుని జయించుటకు గాని, కానిపక్షమున నాయసువుల నచ్చట బాయుటకుగాని నాకు సెలవిచ్చి పంపుము."

"అటుల కాజాలదు. నే నీరీతిగా యేడు మాసములు బడియుండవలసి వచ్చినను సరే గాని నాకార్యమును మరొకడు ముగించరాదు. పగదీర్చుకొనవలసిన వాడను నేను."

విజయుని సలహాయెడ నింత విముఖత గనుపఱచిన విక్రమసింహుని పీనులకు ప్రసన్నకుమారి వివాహ సన్నాహములు జరుగుచున్న కఠోరవార్త వినవచ్చెను. ఆతని పట్టుదల తగ్గ నారంభించెను. విజయుని ప్రార్థనల మన్నింపదొడంగెను. తుట్టతుదకు తనకు మారుగా తనప్రాణతుల్యుడగు విజయుని అజయునిపైకి బంపుట కియ్యకొనెను. తనకు దయతో పరిచర్య గావించిన యోగ్యురాలిని దర్శించి రావలసినదని వేడి ఆమె తనకిడిన పట్టు గుడ్డను విజయునకిచ్చి బంపెను.

కడు నేర్పుతో కొనసాగింప బడినందున యీ మోసము బయల్పడలేదు. విజయుడు జబ్బుగా నున్నటులను విక్రమసింహుడు పూర్వస్థితిలో అటునిటు తిరుగులాడుచున్నటులను ప్రత్యక్షముగా చూపగలిగినందున యెల్లరును విక్రమసింహుడే నిషిద్ధదీవికి తిరిగి వెళ్లినటుల విశ్వసించిరి. నియమితదినమున విక్రమసింహుడు ఆయుధములబూని ప్రతివారి సెలవుబడసెను. అందరును ఆశీర్వదించిరి. ఇంత దుర్బలుడవుగా నున్న నీవు శత్రువు నెటు లెదుర్కొనగలుగుదువని కొందరు జాలిబూని ప్రశ్నించిరి. ప్రసన్నకుమారితో "వెళ్లుచున్నాను, దివ్యసుందరీ!" యనగా, యామె అలక్ష్యముతో "పూర్వముకంటెను అధికకీర్తి బడసెదవుగాక" యని మాత్రము నుడివి చివాలున అటనుండి వెడలిపోయెను.

తన గుఱ్ఱమును దెచ్చులోగా విక్రమసింహుడు గదిలోనికివెళ్లి విజయుని శయ్యనాక్రమించుకొనెను. విజయుడు మిత్రుని దుస్తుల నొక్క క్షణములో దొడిగి కవచధారియై గుఱ్ఱమునెక్కి యందరును చూచుచుండగనె వెడలిపోయెను.

౨

వీరమతి సంగ్రామసింహుని కొమరిత. అజయుడు వారల కుటుంబమునకు గర్భశత్రువు. త్రోవపోడుగునను గ్రామవాసులావిజయుని సంకల్పమును విని యానందబాష్పముల గురిపించుచు ఆతని పలువిధముల దీవించుచుండిరి. అజయసింహుడు సంగ్రామసింహుని పుత్త్రిని, కాబోవు జామాతను కడుక్రూరముగా వధించెనని చెప్పదొడంగిరి. గనుకనే కాబోలు! వారి గృహము అజయునిపైకి యుద్ధమునకు వెడలు ప్రతి వీరునకు స్వాగత మొసంగుచుండెను.

ఉన్నత ప్రాకార పరివేష్టితమైన యాగృహోద్యానమున దాసీజన పరివృతయైయున్న వీరమతిం గాంచి, వీక్షణ మాత్రముననే యసమానరూప లావణ్యాదులచే విస్మయుడయి, విక్రమసింహుని పాత్రనభినయించుచుండుటం బట్టి, వినయముతో ఆమెకు నమస్కరించి నిలచెను.

"సాహసిక యువకుడా! నీవు నాకపరిచితుడవు" అనుచు ఆతనివైపు దృష్టి సారించి, తానిచ్చిన చేతిగుడ్డను గుర్తించి మందస్మితయయ్యెను. విజయుడు ఆమెకు కృతజ్ఞతా పురస్సరముగా వెలలేని మాణిక్యములను విలువగల యాభరణములను సమర్పించెను. వీరమతి పోల్చుకొనజాలక పోయెను. విజయుని విక్రమసింహునిగా భావించి క్షేమమరయ దొడగెను. విజయుడామె ప్రేమాలాపములచే పరవశుడై సహజప్రేమస్వరూపిణియగు నామెయెడ దృఢానురాగబద్ధుడయ్యెను. మరియు, మైమరచి తన దక్షిణహస్త కవచమును దీసివేసెను. వెంటనే వీరమతి "ఆర్యా! నేర్పరుడగు వైద్యుడెవ్వడేనియు ఖండితాంగుళీయమును తెచ్చిపెట్టజాలడు. ఇదెట్టి పరిహాసము! నన్ను వంచించుటకు ఆపీరుడు నిన్నంపెనా?" యనుచు లేచిపోవుచుండ విజయుడామె హస్తమును బట్టుకొని దీనముగా ఇటులనెను.

"సుందరీ! నాదొక్క విన్నపముగలదు. సహనము గలదేని సర్వము వినిపించెదను." వీరమతి యాగ్రహమునకు వెఱచి విజయుడు సత్యమును వెల్లడించెను. విక్రమసింహుని మాన ప్రాణరక్షణ నిమిత్తము తానాతనికి మారుగా అజయసింహునెదుర్కొన బోవుటను తెలిపెను.

"స్నేహితుని కొఱకట్టి త్యాగముచేయ గలిగినట్టియు ఒక యువతి యాగ్రహము నీరీతిగా నుపశమింపజేయ గలిగినట్టియు నీ యౌదార్యము నీ రసికత మెచ్చదగినవి" యనుచు వీరమతి యాగ్రహమెల్ల యదృశ్యముకాగా ఆతనిని గృహాభ్యంతరమునకు దోడ్కొనిపోయి పరామర్శించెను. తన తండ్రి తన యనుంగు సోదరుని మరణానంతరము ఎవ్వరికైనను గాన్పించుట లేదని గూడ వినిపించెను. ఆరాత్రి వారలు భుజింప

జాలకపోయిరి. తన స్నేహితుడు శయనించిన తల్పముపైననే తానును పరుండెను. వీరమతియు వీణాగానముతో అతని నిదురింప జేయబూనెనుగాని యేలనో యామెకంఠము రుద్ధము గాఁజొచ్చెను. మనోదుఃఖము గానమూలకముగా ప్రకటితమగుచుండ విజయుఁడు,

"కలకంఠీ! శ్రావ్యగానమును దుర్భర దుఃఖమును ఈరీతిగా మిశ్రమమైయుండుట మిగుల విస్మయముగాదా?" యనెను.

"వీరాగ్రణీ! అజయుఁడు ప్రాణములతో నుండు నందాక నాకు శాంతి యెక్కడిది? వాడు నాప్రియుని సంహరించి వివాహమునకు పూర్వమే నాకు వైధవ్యదుఃఖమును దెచ్చి పెట్టెను. నాసోదరు డీదారుణవార్త విని అజయుని జంపబోయి తానే జంపబడియె, ఇంకెందరో వీరు లాతనిచే మడసిరి."

పాప మాయువతి దుఃఖమాపుకొనజాలక దురపిల్లుచుండ విజయుఁడు లేచి అజయుని ఆయుష్కాలము క్షీణించినదనియు ఇంకొక్కదివసమే యాతఁడు జీవించియుండుననియు ఆమె నోదార్చెను. ఈ యూరడింపు వాక్యము లామె పలువురద్వార వినియుండెను గావున విశ్వసింపజాలకపోయెను. విజయుఁడా రేయెల్ల జాగరణము జేసెను. వీరమతికి గూడ ఆకాళరాత్రి శివరాత్రియయ్యెను. ఈ వీరుడు నయిత మా క్రూరుని కరవాలమున కెరయగునేమో యాతనికి జయమును గూర్పవలసినదని తనయిష్టదైవమునకు మ్రొక్కుచుండెను.

తెల్లవార జొచ్చెను. విజయుఁడు లేచి తన యీప్సిత మీడేరునను రెట్టింపు ఉత్సాహముతో ప్రయాణమునకు త్వరపడజొచ్చెను. వీరమతి అతిబలవంతముపై అతనికి ద్రాక్షరసము ద్రావనిచ్చి, వెను కటి పట్టుగుడ్డ నాతని శిరోవేష్టమునకు జుట్టి, యాతనితో నీరీతి నుడివెను.

"వీరవరా! అజయునికి రాక్షసబలము గలదు. మధ్యాహ్నము మొదలు నడిరేయి వఱకు ఆతని శక్తి యధికమగుచుండును. నడిరేయి మొదలు మధ్యాహ్న పర్యంతము సన్నగిల్లుచుండును. మరియు, అశ్వారోహియైయున్నప్పు డాతని పరాక్రమ మతిశయించియుండును గనుక నీవు గురిజూచి యాతని గుఱ్ఱమును నేలబడవేయుము. నన్ను విస్మరింపకుము."

వీరమతి సలహాను గైకొని విజయుఁడు కడువేగముతో వెడలిపోయెను. ఆ దినమెల్ల ఆమె కఠినోపవాసము బూనెను. దేవి పూజ గావించెను. సాయంసమయ మాయెను. అంధకారము నల్దిశలలముకొనెను. వీరుడు రాలేదు. ఆతనికొఱకు భోజనము సిద్ధముగావించి తాను భుజించక యాతని రాక నిరీక్షించుచు గూర్చుండెను. గడచిన రాత్రి యీ గృహమధ్యమున నిదురించిన యా యౌదార్యపురుషుడు నేడు అజయుడు సిద్ధపఱచిన శయ్యపై నిద్రించుచున్నాడేమో! యని యనేక రీతుల తలపోయుచు తన ప్రియుని స్మరించుచు దుఃఖించుచుండ వాకిట నుత్సాహపూరిత కేకలు వినవచ్చెను. రక్తసిక్తములైన వసనములతో విజయుసిం

హుడు లోపలి కేతెంచెను. వీరమతి యాతని కరగ్రహణము గావించి "సమాచారమేమిటి?" యని ఆతురతతో ప్రశ్నించెను. "అజయునివలన ఇక నెవరును భీతిల్ల నవసరము లేదు" అనుచు, నొకవస్త్రముచే జుట్టబడియున్న పెద్దదగు హస్తమును పైకిదీసి జూపించెను. వీరమతి చిత్తమునందలి ప్రణయరసమును జూరగొనుట కా హస్తప్రదర్శనము తాళముచెవి వంటిదయ్యెను. అతని స్వల్పగాయములకు తైలము రాచి యీ శుభవార్త తన తండ్రికి వినిపించుటకు పరుగిడెను. అజయుని హస్తమును గాంచి యాతని సంహారము సత్యమని యా వృద్ధుడు నమ్మగలిగెను. తన కుమార్తె హస్తమును బట్టుకొని, యీ సుదినమును గాంచగలుగుటచే తాను ధన్యుడనైనటుల నేమోమో యనుచు తన దీర్ఘశత్రు సంహారకుని వీక్షించుటకు త్వరపడి వచ్చి, "నాకుగల సమస్తము నీది; వరమును గోరుము" అనియెను.

"అటులైన నీ కుమార్తెను నా కొసగుము; అదియే నా వాంఛితము" అని విజయుడనెను. అతి సంతసమున అందులకు సమ్మతించి, తలవాల్చి లజ్జాభరమున నేలవైపు దృష్టుల సారించుచున్న వీరమతి కరకమలమును విజయుని హస్తమునందుంచి, సుముహూర్తము నిశ్చయించి వారలను దంపతుల గావించెను.

వివాహానంతరమున అట నిలువనొల్లక అజయుని మరణవార్తను స్నేహితునకెఱిగించుటకు బైలుదేరెను. వనమధ్యమున నొక సురక్షితస్థానమున గుఱ్ఱమును విడచి తాను రహస్యముగా తన మేడకేతెంచి విక్రమసింహునకు తన విజయమును దెల్పెను. గుణవతియగు భార్య తనకు లభించిన వృత్తాంతమును వినిపింపగా విక్రమసింహుడు మనస్ఫూర్తిగా ఆనందించెను.

కార్యకలాప మింతటితో ముగియలేదు. మర్నాటి యుదయము విక్రమసింహుడు వనమున కేగెను. విజయుఁడు ఆరోగ్యస్నాన మాచరించి, స్నేహితుడు వెడలి వారము రోజులయినను ఇదివరకేల రాలేదో యని యనుమానించుచు ప్రసన్నకుమారి చిత్తకాఠిన్యమును దూషించుచుండ దేవాలయము నుండి తిరిగివచ్చుచున్న ప్రతాపసింహాదులకు ఒక యశ్వారోహకుడు కాన్పించెను. సమీపింపగా ఆతడే విక్రమసింహుడని తెలియగా విజయుడెదురేగి, యాతనిడించి, క్షేమమారయ, ఆతని జయసమాచారమును అందరికన్నను అధిక శ్రద్ధతో వినుచు ప్రజలెల్ల చుట్టును మూగిరి. ప్రభువు గౌరవించెను. ప్రజలు జయధ్వానములు గావించిరి. ప్రసన్నకుమారియు శీఘ్రగమనమున నేతెంచి సంభాషింప నుద్యుక్తయయ్యెగాని విజయుని ఇష్టమునసుసరించి విక్రమసింహు డామెతో "ఒకప్పుడు తిరస్కరింపబడిన స్నేహితులను తిరిగి బడయుట దుర్లభము" అనియె.

గర్వభంగమొందిన యా నిర్భాగ్యురాలు అతని నామము నుచ్చరించుచు మూర్ఛితయయ్యె. ఆసమయముననే విక్రమసింహుఁడొకానొక ధనికుని కొమరితను వివాహమాడ నేగుచున్నాడను వార్త వ్యాపింప నారంభించెను. తన గర్వము పూర్తిగా అంతరించ ప్రసన్నకుమారి తన ప్రియుని తనయెడ ప్రసన్నుఁడగునటుల ప్రార్థింప బోయెను. తన బింకము నిక నిలుపుకొనఁజాలక ఆమె పాణిగ్రహణమున కాతఁడు సమ్మతింప విజయుఁడు అతివైభవముతో ఆ వివాహవేడుకల. జరిపించెను. విందు ముగియగనే ప్రధానపాత్రధారులెల్లరు సంగ్రామసింహుని మేడ నలంకరించిరి. నేత్రపర్వముగా అట విజయుని వివాహవేడుకలను రెండవపర్యాయము గావించి తృప్తుఁడయి విక్రమసింహుఁడు స్వస్థానమున కేగెను.

కథను కడవఱకు వినగోరిన, అసంతుష్టులుగా ఆ దంపతులు వారి భావిజీవనము ను గడుపవలసివచ్చెనని తెలియవలెను. వివాహమైన కొలది కాలమునకు యోగ్యుఁడగు విజయసింహుఁడు యుద్ధములో వీరస్వర్గ మందెను. విక్రమసింహుని దుఃఖమునకు మేరయే లేదు. తన ప్రాణమిత్రుని యుత్తమాంగముకడ నిలుచుండి అతని త్యాగశీలములనుగూర్చి తన బంధుమిత్రాదుల కెఱిగించెను. అజయుని సంహరించినది విజయుఁడని తెలిసిన యనంతరము, స్నేహితు లిరువురు తనయెడ గావించిన ద్రోహమునకు దురాగ్రహపరవశయై ప్రసన్నకుమారి భర్తయెడల విద్వేషియై సంసారముయెడ విరక్తయై సన్న్యాసాశ్రమ స్వీకరణ మొనర్చెను. విజయసింహుని పత్ని పతిగుణముల స్మరించుచు అతని మానసికముగా నారాధించుచు జీవితశేషమును మానవసంసేవయందు గడపి చిరకీర్తి నార్జించెను.

ఉత్తమ మిత్రరత్నమును ప్రియభార్యను ఏకకాలమున బోగొట్టుకొనిన విక్రమసింహుఁడు కడువృద్ధుఁడగు పర్యంతము జీవించి అవిరళాశ్రుధారలచే తన హృద్గతవేదనను అప్పుడప్పుడు వెలువరించుచు చివరకు ఈ మాయాప్రపంచమున నేదియు స్థిరముగాదనియు సర్వము ద్వంద్వభావసమ్మిశ్రితమనియు అనుభవపూర్వకముగా తెలిసికొనగలిగి ఐహికాముష్మికసౌఖ్యమును జేకూర్చు సాధనముల నవలంబింప దీక్షాపరుఁడయి జన్మసాఫల్య మొందెను.

(ఆంగ్లమునుండి యనువాదము)